# నేతి నేతి

తాతగారు రావడం చూసి, అతడు లేచి నిలుచుని నమస్కారంచేశాడు. ఆశీర్వదించి, పక్క కుర్చీలో కూర్చుని 'అగ్గిపెట్టె అందుకోరా ఓమారు–' అంటే, తీసుకురావడానికని నేను లోపలికి వెళ్ళి... పెట్టినచోట కనబడకపోతే, వెదుకుతున్నాను...పట్టుకునివచ్చేలోపల తాతగారు అతడితో పరిచయంచేసుకుని సంభాషణలోకి దిగారు.

'...చాలా సంతోషం బాబూ...నిన్ను చూడటానికి ముచ్చటగా ఉంది. యింత చిన్నతనంలోనే ఫలానా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖకు ప్రధాన ఆచార్యుడవైనావంటే...'

నేనుకూడా ఉత్సాహంకొద్దీ ఆ ప్రశంసా -- ప్రవాహానికి అడ్డం ఈది... 'అవునండీ...అవునండీ-- మా కందరికీ గర్వం యీతన్ని చూసుకుంటూంటే: ఫాయా ఒక్కటే కాదు, ఆంధ్ర సారస్వతంమీద -- అథారిటీ' అన్నాను. అతడు ముసిముసిగా...'ఏమిటోలెండి తమవంటి పెద్దలచలువ! నామీద అభిమానం కొద్దీ మనవాడు అనడంకాని...మీలాటి యోధులముందు మేము లెక్కా జమా' అని వినయించాడు.

'మా చదువూ మేమే చెప్పాలి! చదువుకన్న సందేహాలే ఎక్కువ. ఈనాటికీ తీరవు – పెద్దవాడిని... చనవుతీసుకుని అడుగుతున్నాను...మరి ప్రయాగ బాపన్న చదువుకున్నవాడూ, కర్మిష్ఠి అని ప్రతీతి ఉన్నదికదా! అక్కడే పడిఉండి, ఆ మాలకూడు తింటూండకపోతే...దేశం గొడ్డుపోయిందా? -- మొఖాసా విడిచిపెట్టి పోతే, యింకోచోట ఆశ్రయం దొరికేది కాదా? – శాంతి సుబ్బన్నంటావూ... వైదికపుముండావాడని అనుకోవడమేకాని -- కాస్తో కూస్తో డొక్కశుద్ధిఅయినా...పక్క తాళంబ్రతుకు! భీమరాజు ఏలా అంటే అలా ఆడేవాడు. అగ్నీ వాయువూలాగా ఆ యిద్దరూ ఏకం అయేటప్పటికీ -- అంతా ఓ కొలిక్కి తీసుకువచ్చారు. అంతేకాదూ?--'

తాతగారు...అంత ఘరానా పెద్దమనిషి...మరొకడిని పరుషవాక్యం అనడం...నేను యించుమించు ఎన్నడూ వినలేదనే చెప్పవచ్చు: ఆయన వాకబులో అనంతకోటిస్కాండల్సు తాండవిస్తున్నా...అంగటిదాటవు. మరి. ఏమిటి ఆ ధోరణి...ఎవరు వాళ్లు--

--నాలాగానే అతడూ తెల్లబోయి చూస్తూ ఊరుకున్నాడు.

'తెలియక అడుగుతున్నాను...నీవు అలా ఊరుకోవడం భావ్యంకాదు', అని తాతగారు వదలకుండా హెచ్చరించారు.

"నాకు తెలియదండీ అసలు వా రెవరో" అని అతడు చిన్న బుచ్చుకుంటూ కష్టంగా చెప్పాడు.

"తెలియదనడం నీ వినయాన్ని తెలియజేస్తుంది. అంతే; అది నిజమవుతుందా?"

"ప్రమాణపూర్తిగా..."

"వద్దు బాబూ! అంతమాట అనకూడదు. అబద్ధ మాడవలసినంత అవసరం నీకు ఏమివచ్చింది? చూడు, వయసులో నీకన్న పెద్దవాడినా...ఏదో ఉత్సాహంకొద్దీ ప్రసంగంలోకి దించింది నిన్ను కించపరచవలెనని ఎంతమాత్రమున్నూ కాదు సుమా! నాయనా...మంచిది: మీయిద్దరూ ఖులాసాగా మాట్లాడుకోండి..." అంటూ తాతగారు చుట్ట కిటికీలోంచి బయటకు గిరవాటు వేసి, ఖాండ్రిస్తూ లోపలికి వెళ్ళిపోయినాడు – మంచినీళ్ళు పుక్కిలించడానికి –

--రంగం చెడింది; ఇక నేను కూర్చోమన్నా లాభం లేదు కనుక...అతడు వెళుతానని లేవగానే నేనూ సరేనని గుమ్మందాకా వెళ్ళి...'సాయంకాలము పార్కుకు పెందరాడే వస్తాను. అక్కడనుంచి పిక్చరుకు వెళుదాము...' అంటూ ఉత్సాహంగా మాట్లాడి...దిగాలుపడి, జవాబు చెప్పకుండా, మరియాదకు తలఊపి అతడు వెళ్ళిపోతూంటే – చూస్తూంటే నాకు చాలా కష్టంవేసి...అక్కడే అలాగే నిలుచునిపోయినాను...

"వీడి తస్సాగొయ్యా...ద్రావిడుడంటే ఏలాగైనా ఉద్దండుడే..."

తాతగారు – మళ్ళా ఏమిటి ఆ ధోరణి? నావెనకాలనే నిలుచున్నాడని తెలిసికూడా నేను ఆయనకేసి తిరగలేదు. తిరిగితే...తిక్కమీద...ఏం తూలనాడుతానో అని అమిత భయం వేసింది...ఆయనమీద అందాకా నాకు అంతగౌరవం.

కాని, ఆయనేం ఊరుకున్నారా? – "వెంకట శాస్త్రుల్ల కుటుంబంకూడా అంతదాకా నూజివీడులోనే ఉండేది కాదూ? పిల్ల లెంతమంది? – అల్లుడు పట్టి బదుద్దాయి, సత్రాలల్లో రాళ్ళుకొట్టేరకం... అంతేకాదూ?..."

నాకు...యిహ మండిపోయింది.

"ఏమిటండీ?" అని కొంచెం దురుసుగానే అడిగాను. యిద్దరం ముఖాముఖి కాక తప్పింది కాదు – ఆ ధూకుడుకు.

"అదేనండీ...నేను యిందాకటినుంచీ అంటూన్నదేనండీ...నిజమేనా అండీ..." ఆయన కనుబొమలు చిట్లించి మాట్లాడుతున్నా – కొంటెతనమే కాని...కోపం కాదని తెలుసును; నేను ఏంచేసినా కోప్పడడు...చిన్నప్పుడు నాకు యిచ్చిన వరాలలో అది ఒకటి – అందుకని ఆ ఘట్టంలో నేను నవ్వక తప్పదు...

"ఏదీ ఒక సిగరెట్"...నలభై యేళ్ళనుంచి ఏకబిగిని చుట్టకాలుస్తూన్న, వ్రత శీలి...తాతగారు సిగరెట్ కాలుస్తాననడం...ఏమో అంతా విచిత్రంగా ఉంది – అది వరకల్లా అయితే, ఆయన మొదలుపెట్టిన అల్లరికి అపాటికి అప్పుడే నాకు అంతుచిక్కేది...కలిసి తరువాత కాండ నడిపేవాళ్ళం...కాని...

--తెలివితక్కువగా అంతలో బయటపడటం ఎందుకని...యిచ్చాను. యిద్దరం ముట్టించాము – రెండు దమ్ములలోనే ఆయన చిగురుకులాగి...రాల్చేశారు...మనది యింకా కాలుతూనే ఉంది--

"ఇలా ఉండాలి" అన్నారు--

"ఏది?"

"ఏదైనా కానీ...పైకి మాంచిపసందుగా – నాజూకుగా – ముట్టుకుంటే రాలిపోతూ – పట్టుబడితే కాలిపోతూ, ఆఖరైతేనేగాని అరకపోవడం. అది నిజంగా సుగుణంకాదూ?–"

అవిడ పుణ్యమా అంటూ అమ్మమ్మ యింతలో లోపలనుంచి, మడికట్టుకోమని పిలవడానికని వచ్చి... వింటూ నిలుచుని...నవ్వుతూ–

"బాగానే ఉంది, ఆనాటికానాడు మరీ పసిపాపలవుతున్నారా ఏం..." అన్నది – అయన నిదానంగా ఆమెను ఎగాదిగా చూసి – "వారకన్యక యారీతి వలచుటవే" అంటూ తాకేటంత దగ్గరగా వెళ్ళేటప్పటికి ఆమె కంగారుగా ఒక్క అంగలో లోపలికి పోయింది––

"అదేమిటండీ...మడిగట్టుకున్నది...అందులో యివాళ శనివారంకూడానూ."

"అదేనోయ్ పండిత్ జీ నేను అన్నది – ఆమె శనివారకన్యక...యీ సరసము లాడేటందుకు సమయాసమయముల పాటింపు మనకు అంతగా లేకపోయినా...యీ చేష్టలకు మురిసి, నేను పసివాడిలాగా చెయిచేసుకుంటే నీకే యిబ్బందిసుమా అని హెచ్చరించడమే. యిన్నాళ్ళ నుంచీ కాపురం చేస్తున్న అవ్వను పట్టుకు యిప్పుడు వసంతాలాడించటంకాదు; కన్యక అని గౌరవించడం – దుర్గిలాగా. ..దుర్గి అంటే పురుషోత్తం మేనకోడలనుకునేవు...అసలు దుర్గి...ఆ హంశ అవహింపజేయడం... సమ్‌ఝా?"

"బహుత్"

"శహబాస్... ఆంధ్రసారస్వత – బోధనస్వాములకన్న...నీవే మెరుగు..."

"అతను పాపం చిన్నబుచ్చుకున్నాడండీ" అని అంతలో మూడ్ మార్చుకుని... యింతకుముందు జరిగిన కలాపం అంతా ఒక్కసారి ఉప్పెనలాగా జ్ఞాపకంరాగా...మూతిముడుచుకోబోయినాను – తాతగారు జంకకుండా––

"చిన్నబుచ్చుకుంటేకాదు...దేశానికి ఒరిగేదేంలేదు...చిన్న జీతం పుచ్చుకోమను – అదీ మరియాద"

"అతను చాలా మరియాదస్తుడండీ"

"నిజంగా?"

"నిజం"

"అయితే నిఘంటువు తీయి చూదాము. పోనీ, నీవు చూడు...చదువురాని సరస్వతి అనే అర్థం ఉన్నదేమో...విశ్వవిద్యాలయంవారు అచ్చువేయించినదే అయితే, ఆ నిర్వచనం ఉందనుకుంటాను..."

"మీకు అతనిమీద అంత కోపం ఎందుకో నాకు అర్థం కావడంలేదు––"

"అతనిమీద కాదు...యీతనిమీద కాదు... అసలు అజ్ఞానమంటే అందరికీ సహజంగా ఉండే మంటే!"

"అలా ఎందుకు అభిప్రాయపడుతున్నారో"

"పడేసింది...మీ మిత్రుడు...ఆ ప్రధానాచార్య మహాశయుడే...నీవు చెప్పావు...నీ మాటమీద నమ్మకం ఉన్నది...నీమాటేమిటి, విద్యాధికారులకే నమ్మకం కుదిరినప్పుడు...అతడి కూలంకష పాండిత్యాన్ని నేను శంకించడం మరియాదా? – లేదు, శంకించనేలేదు; కాని...అంతస్థాయికి నేను అందుకోగలసత్తా లేదు

చూడు...అందుకని...లఘువుగానే ధోరణికి ప్రారంభించానా..మరి, బెల్లంకొట్టినరాయిగా ఊరుకోవడం...తెలియదనడం...నేను ఏమనుకోవాలి?--"

"నాకు అర్థంకాలేదు..."

"అవసరంలేదు... అభిరుచి ఉన్నదేకాని, అంత పండితుడవనే అహం ఉందా నీకు? పైగా సైన్సు వాడివి; సైన్సుకూ సారస్వతానికీ సగానికిమించిన ఏక ఉండనక్కరలేదు-- ఉన్నా దోషం లేదనుకో కాని... ఓపిక ఉండాలి అందుకు. మీ నెచ్చెలికి...ఓపిక...జ్ఞాపకం...అవి రెండూకూడా ఒంటికి పడవనుకుంటాను--"

"మీకు - మా ఉభయులతరుఫునా ఒక్క పేద్దనమస్కారం: యింతటితో విడిచిపెట్టండి--"

"విడిచిపెట్టడం అంటే యిదివరకే కళ్లా పట్టుకుకూర్చున్నాను గనుకనా... విషయం వచ్చింది కనుక... విడువదలచుకోలేదు; అమాయకపు బ్రాహ్మణుడు ఆయన...మొకటికి...రాజమంద్రిలో హిందీ అంటూ వచ్చి, తెలుగు మీదఎక్కి తొక్కుతూన్నదని వాపోయినాడు... కాని, యీలాటివాళ్ళప్పు తెలుక్కి పెద్దపీట వేయించుకోవటంవల్ల... భాషకూ పాండిత్యానికీ పాపం బద్దలూ చెక్కలూ అవుతూన్నదని గురితించినట్లు లేదు...ఎందుకులే అనుకోవడం ...మనవల్లమాత్రం ఏమవుతుంది?--"

"అంతేలెండి"

"అని ఊరుకుందాం; సరేకాని, ఒక్క చిన్న అనుమానం...అది మీ మిత్రుడు తీరిస్తే... యింతసేపునుంచీ అనుకున్నది అంతా మరచిపోతాను. చాలా తేలికవిషయం - తెలియకుండా ఉండటానికే వీలులేదు; ఏమంటే - మోడేరాయలకూతురు నిద్రపోతున్నప్పుడు - తెలియకుండా ఎవడో చీకట్లోనే చిందువేసిపోయినాడట...ఏమిటి కారణం? - అంతే - ఏం?"

"యిందాకటివాటి తాతలాగా ఉంది."

"అయితే - కాలేజీవసూనేసి...ముడిగట్టుకు యింట్లో కూర్చుని, శుద్ధనిర్గుణ కందార్థదరువులు - సాగించటమను- ఉచ్ఛనీచాలుఉన్న సారస్వతులకు అదే శిక్ష"--

--భోజనం వేళ అయింది.

★ ★ ★